• పోలీస్ స్టేషన్‌కు బేడీలు

ప్రజాప్రతినిధులు మీడియాతో మాట్లాడకుండా స్టేషన్‌గేటుకు పోలీసులు వేసిన బేడీలను పరిశీలిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

• పిట్టగోడే పోడియం



పోలీస్‌స్టేషన్ లోపలికి రాకుండా గేటుకు బేడీలు వేయడంతో ప్రహరీ గోడ వెనుక నుంచే మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, నేతలు

మాజీ సర్పంచ్‌లపై దమనకాండ

మొదటిపేజీ తరువాయి...

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికోసం వచ్చిన తెలంగాణ సర్పంచుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలను బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూధన్‌రెడ్డితో సహా 19మంది సర్పంచులు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఓ హోటల్‌లో బసచేసి సోమవారం ఉదయం సీఎం నివాసానికి బయలుదేరారు. దీంతో అప్పటికే సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు.

మద్దతుగా హరీశ్ ధర్నా

రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. హైదరాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచులను కౌన్సిల్ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నేతలతో కలిసి పరామర్శించారు. మాజీ సర్పంచులకు భరోసానిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు, పలువురు బీఆర్ఎస్ ముఖ్యనేతలు తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లోనే బైఠాయించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. 2019నుంచి 2024 దాకా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలను అద్భుతమైన రీతిలో తీర్చిదిద్దేందుకు సర్పంచులు కష్టపడ్డారని అన్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడిచినా ఇప్పటికీ పెండింగ్ బిల్లులు రాకపోవడంతో అనేక మంది సర్పంచులు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలి పారు. కాగా సీఎం ఇంటిముట్టడికి బయలుదేరిన సర్పంచులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్‌లను పోలీసులు డీసీఎం వ్యాన్‌లో తీసుకెళ్తుండగా అడ్డుకుంటున్న హరీశ్, వేముల, సంజయ్ తదితరులు

పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తున్న హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మాజీ సర్పంచ్‌లు ఏమైనా టెర్రరిస్టులా?

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీమంత్రి హరీశ్‌రావు మండిపాటు

కంటోన్మెంట్, నవంబర్ 4: రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేసి నిర్బంధించడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్‌లు చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తే ఎక్కడికక్కడ నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అర్ధరాత్రి దొంగలు, టెర్రరిస్టులను అరెస్టు చేసినట్టు తీసుకెళ్లడం హేయమైన చర్య అని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ చైర్మన్‌లు గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజీవ్‌సాగర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్‌ల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. అప్పులు చేసి, భార్యాపిల్లల మీదున్న బంగారం అమ్మి పనులు చేశామని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు అడిగితే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఉత్తమమైన గ్రామాలకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందంటే, ప్రధాని అవార్డులు, పంచాయతీ అవార్డులు సాధించిందంటే అందులో సర్పంచుల పాత్ర కీలకమని అన్నారు. మంచి పనులు చేసిన సర్పంచులకు ఎందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శిక్ష వేస్తున్నారని మండిపడ్డారు. బడా కాంట్రాక్టర్లకు వందల కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారని.. కానీ పనులు చేసిన పాపానికి పేద సర్పంచులు శిక్ష అనుభవించాలా అని ప్రశ్నించారు. లక్షా 50వేల కోట్లతో మూసీని బాగు చేస్తానని అంటున్నావు. కానీ గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసిన సర్పంచులకు ఎందుకు శిక్ష వేస్తున్నావని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చి 10 నెలలు దాటింది పది లక్షల బిల్లులు కూడా వారికి చెల్లించలేదని అన్నారు. మాజీ సర్పంచులు నాలుగైదు సార్లు హైదరాబాద్‌కు వచ్చి మొర పెట్టుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా పంచాయతీ శాఖ మంత్రి సర్పంచులను చర్చలకు పిలవాలని.. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ దుర్మార్గపు చర్యలను ఎండగడుతాం

మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యంలో అణచివేతలకు ఆస్కారమే లేదని, బెదిరింపులు, భయభ్రాంతులకు తావులేదని మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి అన్నారు. డిమాండ్‌ల పరిష్కారానికి చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్ బృందంతో కలిసి వెళ్లిన మాజీ స్పీకర్ మధుసూదనచారి మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉన్నత స్థాయికి చేరితే... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే... మళ్లీ తిరోగమన స్థితికి చేరిందని విమర్శించారు. మానవ దృక్పథంతో స్పందించాల్సిన ప్రభుత్వం మాజీ సర్పంచుల సమస్యలను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమస్య పరిష్కారాన్ని విస్మరించి, గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ దుర్మార్గ చర్యలను ఎండగడతామని చెప్పారు. సర్పంచుల సమస్యలు పరిష్కరమయ్యేంత వరకు బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని తెలిపారు. మాజీ సర్పంచులను తక్షణమే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పొంగులేటికో న్యాయం.. వీరికో న్యాయమా?

- బిల్లుల చెల్లింపులో జాప్యమెందుకో చెప్పాలి
- అందోల్‌లో మంత్రి రాజనర్సింహ అవినీతి పర్వం: మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్
- ఏడాదైనా జాబ్ క్యాలెండర్ జాడేది?: గెల్లు

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్. చిత్రంలో గెల్లు శ్రీనివాస్

హైదరాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): అధికారంలోకి రాగానే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. మాజీ సర్పంచులకు చెల్లించడంలో జాప్యమెందుకని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలసి క్రాంతికిరణ్ మీడియాతో మాట్లాడారు. న్యాయం కోసం పోరాడుతున్న మాజీ సర్పంచ్‌ల అరెస్ట్ అక్రమమని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతున్నదని, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులకు ప్రస్తుతం అధికార పార్టీ నేతలు అంచనాలు పెంచుతున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల కోసమే అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అంధోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ కనుసన్నల్లో అవినీతి పెచ్చరిల్లుతున్నదని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రోడ్ల నిర్మాణానికి 54 లక్షలు మంజూరు చేశారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం టెండర్లను రద్దు చేసి వంద శాతం అంచనాలు పెంచి, అవినీతి పర్వానికి తెరతీసిందని ఆరోపించారు. మంత్రి బావమరిది కాంట్రాక్టర్ అవతారమెత్తి దోపిడీకి పాల్పడుతున్నాడని క్రాంతికిరణ్ విమర్శించారు. ఆంధోల్‌లో సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను అటకెక్కించారని ఆగ్రహంవ్యక్తం చేశారు.

జాబ్ క్యాలెండర్ జాడేది: గెల్లు శ్రీనివాస్‌యాదవ్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా జాబ్ క్యాలెండర్ జాడ లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఎన్నికల ముందు హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఉద్యోగాలు ఇవ్వాలని అడిగినందుకు నిరుద్యోగులపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 163 సెక్షన్ పెట్టి ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ కులగణనపై కాంగ్రెస్ నాయకుల చెప్తున్న మాటలు నమ్మబోమని గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తేల్చిచెప్పారు.

సర్పంచ్‌ల బకాయిలకు సర్కారు గ్యారెంటీ

- మార్చి 31లోగా విడుతల వారీగా చెల్లిస్తాం
- ఆర్థిక స్థితి బాగా లేదు.. అర్థం చేసుకోండి
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తేతెలంగాణ): 'సర్పంచ్‌ల బకాయిలకు సర్కారు గ్యారెంటీ అని.. వచ్చే ఏడాది మార్చి 31లోగా విడతల వారీగా పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తాం' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదు.. సర్పంచులు అర్థం చేసుకోండి..'అంటూ విజ్ఞప్తి చేశారు. సర్పంచుల బాధలు తమకు తెలుసని, ప్రతిపక్షాల ఉచ్చులోపడి ప్రభుత్వాన్ని బద్నాం చేయవద్దని కోరారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పదేండ్లలో తెలంగాణకు చేసిందేంటో చెప్పాలని ప్రశ్నించారు. దమ్ముంటే అమరువీరుల స్థూపం వద్దకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరిస్తున్నా పట్టించుకోని కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ హామీల గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. రూ. 10 వేల కోట్ల వరద నష్టం జరిగిందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ చౌహాన్‌కు నివేదిస్తే కేవలం రూ. 400 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటే కిషన్‌రెడ్డి పట్టించుకోలెదెందుకని నిలదీశారు. కిషన్‌రెడ్డిది తెలంగాణ డీఎన్ఏ కాదని, అందుకే న్యాయం చేయలేదని దెప్పిపొడిచారు.

మాజీ సర్పంచుల అరెస్టు దారుణం

- కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 4 : పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడంతో అనేకమంది మాజీ సర్పంచులు రోడ్డున పడే పరిస్థితి నెలకొన్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. మాజీ సర్పంచులు రోడ్డెక్కి బిచ్చగాళ్లుగా అడుక్కునే పరిస్థితిని కాంగ్రెస్ సర్కార్ కల్పించిందని మండిపడ్డారు. సోమవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు భారీగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణపై టెస్లా దృష్టి పెట్టకపోవడం తీవ్ర అవమానకరం

సీఎం, మంత్రులు ఏం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) ఎలక్ట్రిక్ కార్ల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన అమెరికన్ కంపెనీ 'టెస్లా' త్వరలో భారత్‌కు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆ కంపెనీ గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఏదో ఒకచోట తమ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. టెస్లా యూనిట్ ఏర్పాటుకు తెలంగాణను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకపోవటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సహా పలు ఇతర దేశాల్లో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టెస్లా సంస్థను తెలంగాణకు రప్పించేందుకు ఏమాత్రం ప్రయత్నించని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తుంటే తీవ్ర ఆవేదన కలుగుతున్నదని తెలిపారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన తెలంగాణను టెస్లా తన ప్లాంట్ ఏర్పాటు కోసం పరిగణనలోకి తీసుకోకపోవటం రాష్ట్రానికే తీవ్ర అవమానకరమని కేటీఆర్ పేర్కొన్నారు.

గెజిట్ మేరకు సర్టిఫికెట్లలో పేరు మార్పు

హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): గెజిట్ ద్వారా పేరు మార్పు చేసుకున్న పిటిషనర్ సర్టిఫికెట్లలో రెండు వారాల్లోగా పేరును మారుస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. సవరించిన పేరుతో రెండు వారాల్లోగా స్కూల్, సెకండరీ బోర్డు, యూనివర్శిటీలు సర్టిఫికెట్లు జారీ చేస్తాయని తెలియజేసింది. సర్టిఫికెట్లలో పేరు మార్పునకు సంబంధించి 1961లో జారీ అయిన జీవో 1263లోని నిబంధనలను సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన వీ మధుసూదన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చింది. దీంతో ఆ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు హైకోర్టు తెలిపింది.

పారిశుధ్య కార్మికులకు ఇండ్లు ఇవ్వాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, నవంబర్ 4: పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపలి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. 9న పారిశుధ్య కార్మికుల హక్కుల సాధనకు భవిష్యత్ కార్యాచరణ ప్రటించనున్నట్టు వెల్లడించారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూటికి 80 శాతం దళిత పేద వర్గాలు పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారని, వారు కనీస వసతుల లేక జీవనం కొనసాగిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో పారిశుధ్య కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంజన్న, నరేశ్, శ్యామ్‌రావు, వరిగడ్డి చందు, తిరుమలేశ్, జన్నారపు జీవన్, శ్రీకాంత్, సురేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



చెరువుల్లో చేప పిల్లల్ని వదలమంటే ఏం వదులుతున్నాడో చూడు!

పాలనను గాలికి వదిలి ఊరేగుతున్న సర్కార్

శాంతియుత నిరసనపై నిర్బంధకాండ

మాజీ సర్పంచ్‌లను తక్షణమే విడుదల చేయాలి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిత్యం అరెస్టులపర్వమే కొనసాగుతున్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అన్నివర్గాలపై నిర్బంధకాండ కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మొదలు మంత్రుల దాకా ఎవరికి వారు పోటీపడి పాలనను గాలికి వదిలి ఊరేగుతున్నారని విమర్శించారు. అన్ని వర్గాలను పోలీసులతో అణచివేయాలని ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని, ఏ అణచివేతలూ ప్రజా ఆకాంక్షలను నిలువరించలేవనే సత్యాన్ని గుర్తించాలని హెచ్చరించారు. మాజీ సర్పంచుల అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా ? శాంతియుత నిరసనకు పిలుపునిస్తే మాజీ సర్పంచులను చేస్తారా ? ఇదేనా ప్రజాపాలన అంటే అని ఆయన ప్రశ్నించారు.

అరెస్టు హేయం: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ చిన్నచిన్న పనులు చేసిన మాజీ సర్పంచులను మాత్రం అరెస్టులు చేస్తారా ? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లలో బంధించడం హేయమైన చర్య అన్నారు. సర్పంచ్‌లకు డబ్బులు లేవు కానీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిలకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉంటాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మాజీ సర్పంచ్‌ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కక్షసాధింపు మానుకోవాలి: మాజీ మంత్రి కొప్పుల

ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కార్ శాంతియుత కార్యక్రమానికి పిలుపునిస్తే అరెస్టు చేయటాన్ని ఏమనాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని దాదాపు ఏడాది నుంచి అడుగుతున్నా కాంగ్రెస్ సర్కార్‌కు చేతులు రావటంలేదని విమర్శించారు. కక్షసాధింపు చర్యలను మానుకోవాలని, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేసి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అరెస్టులు అప్రజాస్వామికం: మాజీ మంత్రి ఎర్రబెల్లి

మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయటం సరికాదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు గడిచినా మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా వారిని అరెస్టులు చేయటం దారుణమన్నారు. ముఖ్యమంత్రి కలిసి వినతి పత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికం అన్నారు.

ఇదేనా ప్రజాపాలనా? : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా? అని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించకపోవడంపై ఆయన మండిపడ్డారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అరెస్ట్ దుర్మార్గం: మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

పెండింగ్ బిల్లుల కోసం పది నెలలుగా శాంతియుతంగా పోరాడుతున్న మాజీ సర్పంచ్‌ల అరెస్ట్ దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఖండించారు. వారి సొంత గ్రామాల్లో అర్ధరాత్రి నిర్బంధంగా అదుపులోకి తీసుకోవడం హేయమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం ధర్మపోరాటం చేస్తున్న వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.